

నిఫా పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిజిహెచ్‌లో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు - జిల్లాలో ప్రభావం నిల్
- ప్రజాశక్తితో డిఎంహెచ్ఒ డాక్టర్ బి.రామ గిడ్డయ్య

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

నిఫా వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్ఒ బి.రామ గిడ్డయ్య తెలిపారు. జిజిహెచ్‌లో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో నిఫా ప్రభావం లేదని తెలిపారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు...



నిఫా వైరస్ అంటే ఏంటి..? ఎలా సోకుతుంది?

డిఎంహెచ్ఒ : గబ్బిలాలు, పందుల నుంచి మనిషికి వ్యాపించేదే నిఫా వైరస్. కొవిడ్ తరహాలోనే ఇదీ ఉంటుంది. తొలుత జంతువుల నుంచి మనుషులకు సోకుతుంది. ఆ తర్వాత.. ఈ వ్యాధి మనిషి నుంచి మనిషికి కూడా వ్యాపిస్తుంది. నిఫా వైరసుకు ఇప్పటికీ సరైన చికిత్స లేకపోవడం, వ్యాక్సిన్ సైతం అందుబాటులో లేకపోవడం ఆందోళనకర విషయం.

లక్షణాలు, చికిత్స ఏమిటి?

డిఎంహెచ్ఒ : నిఫా వైరస్ లక్షణాలు స్వల్పంగా ఉండొచ్చు. లేదా ప్రాణాంతకంగా కూడా ఉండొచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్) చెబుతోంది. ఉపిరితిత్తుల్లో స్వల్పంగా సమస్యల నుంచి ప్రమాదకరమైన ఎన్సిఫిలైటిస్ వరకు ఈ వ్యాధి లక్షణాలు ఉన్నాయి. కానీ వ్యాధి ముదిరితే మాత్రం ఊపిరి పీల్చుకోవడం కూడా చాలా కష్టమవుతుంది. వ్యాధి తీవ్రత పెరిగిన 24 గంటలు నుంచి 48 గంటల్లో సంబంధిత మనిషి కోమాలోకి జారుకునే ప్రమాదం కూడా ఉందని డబ్ల్యూహెచ్ఓ వెల్లడించింది. వైరస్ సోకిన 14 రోజులు - 45 రోజుల మధ్యలో వ్యాధి నయమవుతుంది. ఈ వ్యాధి నుంచి కోలుకున్న వారిలో చాలా మంది ఆరోగ్యంగా ఉంటారు. కానీ 20శాతం మందిలో నరాలకు సంబంధించిన సమస్యలు ఎదురవుతాయని డబ్ల్యూహెచ్ఒ తెలిపింది. ప్రస్తుతానికి నిఫా వైరసుకు ప్రత్యేకించి ఎలాంటి చికిత్స లేదు. వ్యాక్సిన్ కూడా అందుబాటులో లేదు. ఐసీయూలో పెట్టి చికిత్స మాత్రమే అందిస్తారు. అయితే ఈ వైరస్ తీవ్రత తగ్గించేందుకు మోనోక్లోనల్ యాంటీబాడీ డోసులను వాడుతారు.

నిఫా వైరస్ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి?

డిఎంహెచ్ఒ : పందులు, గబ్బిలాలకు దూరంగా ఉండాలి. గాట్లు పెట్టినట్లున్న పచ్చి పండ్లను తినకూడదు, తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలి. పూర్తిగా ఉడికిన మాంసమే తినాలి, బయటి మాంస పదార్థాలకు దూరంగా వుండాలి. వ్యాధి లక్షణాలు కనిపించినట్లు అనుమానం ఉంటే వెంటనే వైద్యులను సంప్రందించాలి. తప్పనిసరిగా మాస్క్ ధరించాలి, శానిటైజర్ వాడాలి పరిసరాలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి చేతులు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.

ఫ్యామిలీ ఫిజీషియన్, జగనన్న ఆరోగ్య సురక్ష పథకాలు ఎలా పనిచేస్తున్నాయి?

డిఎంహెచ్ఒ : ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ బాలమురళి పర్యవేక్షణలో నిర్వహించబడుతున్నాయి. నోడల్ ఆఫీసర్ పర్యవేక్షణలో షెడ్యూల్ రూపొందించి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఈ పథకం కింద ప్రజలకు 105 రకాల మందులు ప్రభుత్వం అందుబాటులో ఉంచింది 14 రకాల టెస్టులు చేయడం జరుగుతుంది. 40 వాహనాల ద్వారా ప్రతి పీహెచ్ఈసి పరిధిలోని విలేజ్ హెల్త్ క్లినిక్ లలో ప్రజలకు ప్రజలకు ఆరోగ్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ పథకం ద్వారా ప్రజలు ఎంతో లబ్ధి పొందుతున్నారు.

ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా అమలు చేయబోతున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ఎలా ఉంది?

డిఎంహెచ్ఒ : ఏఎన్ఎం, వాలంటీర్లు, ఎంఎల్‌హెచ్పి, సిహెచ్ఓల పరిధిలో సర్వే జరుగుతుంది.30 నుంచి ఆరోగ్య శిబిరాలు మండలానికి మునిసిపాలిటీకి ఒక్కొక్కటి చొప్పున నిర్వహిస్తున్నాము. ప్రభుత్వ నియమాన నిబంధనల మేరకు కార్యక్రమాలు ఉంటాయి.. ఇందులో ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లు, ఇద్దరు పీహెచ్సీ డాక్టర్లు వైద్య చికిత్సలు అందిస్తారు. క్రిటికల్ గా వచ్చిన కేసులను ఆరోగ్యశ్రీ కింద ఉన్నత ఆసుపత్రులకు రెఫర్ చేస్తారు. ప్రధానంగా ఈ టీంలో గైనకాలజిస్ట్, చిన్నపిల్లల వైద్యులు, జనరల్ మెడిసిన్ వైద్యులు ఉంటారు.



అడుగుకో గుంత..

- చిన్నపాటి వర్షానికే బురదమయం - వాహనదారులకు తీవ్ర అవస్థలు



సి.బెళగల్ మండలం ముడుమాల - కొండాపురం రోడ్డు దుస్థితి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/విలేకరులు

గ్రామీణ రోడ్లలో ఎక్కడ చూసినా అడుగుకో గుంత కనిపిస్తోంది. చిన్నపాటి వర్షం వచ్చిందంటే చాలు గ్రామీణ రోడ్లన్నీ కుంటల్లా మారిపోతున్నాయి. చాలా రోడ్లు కంకర, మట్టి తేలడంతో చినుకు పడగానే చిత్తడిగా మారిపోతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు...

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ గ్రామీణ ప్రాంతాల రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. రహదారిపై నీరు చేరడంతో కాలనీవాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీరు రోజుల తరబడి నిలబడడంతో దుర్వాసన వెదజల్లుతుంది. దోమలు వ్యాప్తి చెంది రాత్రి పూట కంటిమీద కునుకు ఉండడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి రహదారులపై మురికి నీరు నిలువ లేకుండా చేయాలని కోరుతున్నారు. పలు ప్రాంతాల్లో రహదారి అడుగుకో గుంతతో వాహనదారులకు దర్శనమిస్తోంది. వాహనాలు ఈ గుంతలలో ఇరుక్కొని వాహనాలు రిపేర్లు వచ్చిన పరిస్థితులు కూడా చాలా ఉన్నాయి. ఆదోని మండలం పరిధిలో దిబ్బనకల్ క్రాస్ నుండి బసరుకోడు వరకు, సంతేకూడ్లూరు నుండి కర్ణాటక సరిహద్దు బంద్రహాల్ క్రాస్ వరకు, పెద్దహరివణం నుండి ఇంగళదహాల్ రెస్ట్ వరకు, పెద్దహరివాణం నుండి నాడంగా క్రాస్ వరకు,గజ్జహల్లి క్రాస్ నుండి గజ్జెల్లి వరకు, కుప్పగల్ క్రాస్ నుంచి జాలమంచి వరకు రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. సి.బెళగల్ మండలంలో పలుకుదొడ్డి రహదారి అధ్వానంగా ఉంది. కొత్తకోట - తిమ్మందొడ్డి మధ్య గుంతలు ఏర్పడటంతో తరచూ వాహనాలు ఇరుక్కుపోతున్నాయి. ముడుమాల–కొండాపురం మధ్య రోడ్డు అధ్వానంగా తయారైంది. చిప్పగిరి మండలంలో చాలా గ్రామాల రోడ్లు వర్షానికి అధ్వానంగా తయారయ్యాయి. వాహనదారులు, ప్రజలు ఆ రోడ్లల్లో వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రామదుర్గం బస్సు స్టేజి నుంచి గ్రామంలోకి వెళ్లే అడ్డ రోడ్డు, నేమకల్లు బస్ స్టేజి నుంచి నేమకల్లు గ్రామంలోకి వెళ్లే రోడ్లు, తిమ్మాపురం గ్రామంలోకి వెళ్లే అడ్డరోడ్ల పరిస్థితి దయనీయంగా ఉంది. ఆలూరు ప్రధాన రహదారిలో పలు ప్రాంతాల్లో రోడ్లు గుంతలు పడి దర్శనమిస్తున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ముందు రోడ్డు పరిస్థితి దారుణంగా ఉంది. పెద్దకడబూరు మండలంలోనూ రోడ్ల పరిస్థితి అదే విధంగా ఉంది. కల్లుకుంట గ్రామం బస్టాండ్ రోడ్డు బురదమయంగా మారింది. పెద్దకడబూరు, చిన్న తుంబలం, మేకడోన ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. సి.బెళగల్ మండల కేంద్రంలో బస్టాండ్ ముందు రోడ్డు గుంతలు పడి దర్శనమిస్తోంది. కర్నూలు నగరం నుంచి గార్గేయపురం వెళ్లే అమరావతి రోడ్డు బురదమయంగా మారింది. కౌతాళం మండలంలో పలు గ్రామాల రహదారులు అధ్వానంగా మారాయి. హాల్వి నుంచి ఉరుకుంద, కౌతాళం నుంచి బదినేహాల్, ఎరిగిరి నుంచి ఉరుకుందకు వెళ్లే రహదారులు గుంతలు పడ్డాయి. ఆ దారుల్లో ప్రయాణినికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ఆదోని మండలంలో రోడ్డు దుస్థితి

ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో



పెద్దహరివణం గ్రామం నుండి ఇంగలదహాల్ వరకు సుమారు 6 కిలోమీటర్ వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. రాత్రి సమయంలో ప్రయాణించాలంటే ఏ ప్రమాదం ఎప్పుడు ఎక్కడ సంభవిస్తుందని భయం గుప్పెట్లో ప్రయాణం చేయాల్సి పరిస్థితి ఏర్పడింది.

- చిన్నరంగస్వామి, ఇంగలదహాల్, ఆదోని మండలం.

సరిహద్దు ప్రాంతం నిర్లక్ష్యం



కర్ణాటక సరిహద్దు ప్రాంతం, సంతేకూడ్లురు గ్రామం నుండి బంద్రాల్ క్రాస్ వరకు ఎనిమిది కిలోమీటర్ ప్రాంతం. సుమారుగా 200 పై గుంతలు ఏర్పడ్డాయి.నిత్యం లారీలు, బస్సులు, ద్విచక్ర వాహనాలు,శిరుగుప్ప రాష్ట్రం కర్ణాటక నుండి, సింధనూర్,మహారాష్ట్ర వరకు వేల సంఖ్యలలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. అయితే గుంతలు ఏర్పడంతో ఎప్పుడు ఏ ప్రమాదం చూస్తామని భయాందోళనల మధ్య ప్రయాణం చేయాల్సి వస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

- శివప్ప, పెద్దహరివాణం, ఆదోని మండలం.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం

- కర్నూలు క్రీడాభివృద్ధికి తోడ్పాడతాం
- మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల రగ్బీ పోటీలు కర్నూలు శివారులోని ఆదర్శ విద్యామందిర్ క్రీడా ప్రారంగణంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. రగ్బీసంఘం ఆధ్వర్యంలోనిర్వహించిన ప్రారంభ కార్యక్రమానికి మాజీ ఎంపీ టిజి.వెంకటేష్, కెవి.సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత కెవి. సుబ్బారెడ్డి, డాక్టర్ శంకర్ శర్మ, పారిశ్రామికవేత్త బివి రెడ్డి ,ఆదర్శ విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ హరికిషన్, సౌత్ ఇండియా రగ్బీ డెవలప్మెంట్ మేనేజర్ నోయల్ ,రాష్ట్ర రగ్బీ సంఘం కార్యదర్శి రామాంజనేయులు జిల్లా రగ్బీ సంఘం అధ్యక్షులు గుడిపల్లి సురేందర్ పాల్గొన్నారు. టిజి వెంకటేష్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో క్రీడాభివృ ద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 40 సంవత్సరా లుగా రాజకీయాలకతీతంగా తాము క్రీడాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నట్టు తెలిపారు. క్రీడాభివృద్ధి ఎక్కడ జరుగుతుందో అక్కడ ప్రజలు సంతోషంతో పాటు క్రమశిక్షణ అలవరుచుకుంటారని తెలిపారు. ఇక్కడి క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు అన్ని విధాలుగా సహకరిస్తానని తెలిపారు. క్రీడలతో ఆనందం, ఆరోగ్యం అలవర్చుకోవచ్చని.. కొన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను సైతం గుర్తుపట్టని వారు అంతర్జాతీయ క్రీడాకారులను గుర్తిస్తారని వారు కెవి సుబ్బారెడ్డి తెలిపారు. చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని క్రీడాభివద్ధికి తన వంతు కృషి చేస్తానని డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఇకనుండి క్రీడలు ఎక్కడ జరిగితే అక్కడ తన ప్రోత్సాహం ఉంటుందని పారిశ్రామికవేత్త బివి. రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు చిట్టి బాబు ,విజయకుమార్, సుధీర్ ,నాగరత్నమయ్య, కొల ప్రతాప్. పిఇటిలు పరశురాముడు, ప్రభాకర్, ఎండి.బాష తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న అతిథులు టిజి వెంకటేశ్, డాక్టర్ శంకర్ శర్మ, డాక్టర్ కెవి సుబ్బారెడ్డి తదితరులు

3న బ్లాక్‌డేగా పాటించాలి

రైతు సంఘాల పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

లఖింపూర్ ఘటనలో చనిపోయిన వారికి బాధ్యులైన కేంద్ర సహాయ మంత్రి అజయ్ మిశ్రాను కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని, రైతులు పండించిన పంటలకు కనీసం మద్దతు ధరను చట్టబద్ధత చేయాలని డిమాండ్ చేస్తూ కర్నూలు జిల్లాలోని అన్ని మండలాలలో రైతు సంఘాల సమన్వయ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 3న నిరసన తెలిపి బ్లాక్‌డేగా పాటించాలని రైతు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శులు కె.జగన్నాథం, జి. రామకష్ణ, రైతు కూలీ సంఘం నాయకులు సుంకన్న, న్యూ డెమొక్రసీ పార్టీ నాయకులు మల్లికార్జున, రైతు స్వరాజ్య నాయకులు పోతుల శేఖర్ లు తెలిపారు. మూడు నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో చారిత్రాత్మకమైన పోరాటం జరిగిందన్నారు. ఈ ఉద్యమంలో 750 మంది రైతులు చనిపోయారని, వారికి కేంద్ర ప్రభుత్వం ఎక్స్ గ్రేసియా ప్రకటించాలన్నారు. ఈ ఉద్యమం సందర్భంగా వేలాది మంది రైతుల పై కేసులు పెట్టారని, ఈ కేసులు ఉపసంహరించుకోవాలన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరను చట్టబద్ధత చేయాలన్నారు. 2022 వ సంవత్సరం లో చేసిన విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని, ఈ డిమాండ్ల పరిష్కారానికై అక్టోబర్ 3న బ్లాక్ డే గా పాటించాలని వారు పిలుపునిచ్చారు. కార్మిక సంఘాలు చేపట్టే ఈ నిరసన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

రావణకాష్టంగా రాష్ట్రం : కెఇ.కృష్ణమూర్తి

ప్రజాశక్తి-పత్తికొండ

వైసిపి పాలనలో రాష్ట్రం రావణ కష్టంలా మారిందని టిడిపి మాజీ డిప్యూటీ సిఎం కెఇ. కష్ణమూర్తి, కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విడుదల కోరుతూ పత్తికొండ ఇన్‌చార్జి కెఇ.శ్యాంబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే దీక్షలకు ఆదివారం కెఇ.కృష్ణమూర్తి ,కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సంఘీభావం తెలిపారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందని వచ్చే ఎన్నికల్లో వైసిపి బుద్ధి చెప్పి తెలుగుదేశాన్ని అధికారంలో తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో రాష్ట్ర ప్రజలు మోసపోయారని, నిరుద్యోగ యువతకు జాబ్ కాలండర్‌ను విడుదల చేస్తామని చెప్పి జీవిత జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 18వ రోజు దీక్షలో కూర్చున్న వారికి నిమ్మ రసం ఇచ్చి విరమింపజేశారు.



దీక్షలో మాట్లాడుతున్న కెఇ. కృష్ణమూర్తి, కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి



కర్నూలు ధర్నాచౌక్‌లో నిరసన తెలుపుతున్న కెఇ కృష్ణమూర్తి, దేవినేని ఉమ

చంద్రబాబును అరెస్టు మూర్ఖపు ఆలోచన

టిడిపి ధర్నాలో పాల్గొన్న కెఇ,దేవినేని ఉమా

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

రాష్ట్రాన్ని అభివద్ధి చేసింది, పట్టిసీమ లాంటి ఎన్నో ప్రాజెక్టులను పూర్తి చేసి వేల ఎకరాలకు నీటిని అందించిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందని మాజీ డిప్యూటీ సిఎం కెఇ. కృష్ణమూర్తి, మాజీ మంత్రి దేవినేని ఉమా అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని ధర్నా చౌక్‌లో టిడిపి చేపట్టిన నిరసన దీక్షల్లో మాట్లాడారు. వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివద్ధిలో పాలించాలంటే చంద్రబాబు ఒక్కడివల్లే అవుతుందని, సైకో ముఖ్యమంత్రుల వల్ల రాష్ట్రం అభివద్ధి కుంటుపడిందని చంద్రబాబు అరెస్టు మూర్ఖపు ఆలోచన, ఆయన్ను అరెస్టు చేస్తే టిడిపి కార్యకర్తలు బయపడరన్నారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని రాబోయేది టిడిపి ప్రభుత్వమన్నారు. ఈ నిరసనకు న్యాయవాదులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శులు పోతురాజు రవికుమార్, వై.నాగేశ్వరరావు యాదవ్, జిల్లా నాయకులు సోమిశెట్టి నవీన్, సత్రం రామకృష్ణుడు, నాగరాజు యాదవ్ పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్

సచివాలయం,ఆర్‌బికె ప్రారంభం

ప్రజాశక్తి -సి బెళగల్

సి బెళగల్ మండలం బురాన్ దొడ్డిలో సచివాలయం, ఆర్‌బికెలను కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఆదివారం ఘనంగా ప్రారంభం చేశారు. ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు సకాలంలో సేవలు అందించేందుకు ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చేందుకు ఈ నూతన భవనాలను నిర్మించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొంతల మునెప్ప, ఇఒఆర్‌డి సందీప్, ఎఒ మల్లేష్ కుమార్, నాయకులు కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం : కలెక్టర్

కోడుమూరులో స్వక్షతాహి సేవ కార్యక్రమం

ప్రజాశక్తి -కోడుమూరు

పరిసరాల పరిశుభ్రతతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ డాక్టర్ జి.సృజన సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి పారుశుధ్య సిబ్బందితోపాటు ప్రజల భాగస్వామ్యం కావాలని ఆమె కోరారు. కోడుమూరు గ్రామ పంచాయితీలో సర్పంచ్ బి భాగ్యరత్న అధ్యక్షతన జరిగిన స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్, సుధాకర్, జిల్లా పంచాయితీ అధికారి నాగరాజు నాయుడు ,డివిజనల్ పంచాయితీ అధికారి తిమ్మక్క ఎంపిపి రూతమ్మ, జడ్‌పిటిసి బి రఘునాథ రెడ్డి, ఎంపిడిఒ చంద్రశేఖర్, తహశీల్దార్ పాల్గొన్నారు. హరితరాయపరులను జిల్లా అధికారులు సన్మానించారు. ఈ స్వచ్ఛత సేవ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు పాల్గొన్నారు. మహాత్మా గాంధీ విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి గ్రామంలో వీధులను శుభ్రం చేసారు. ఈ కార్యక్రమంలో, సచివాలయ సిబ్బంది, మండల అధికారులు ప్రజలు పాల్గొన్నారు.



స్వక్షతాహి సేవ కార్యక్రమంలో కలెక్టర్ జి.సృజన, ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

పత్తికొండ: ఇంటి చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పత్తికొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచి కొమ్ము దీపిక గ్రామపంచాయతీ సలహాదారులు, మాజీ ఎంపిపి నాగరత్నమ్మ అన్నారు. ఆదివారం పత్తికొండ పట్టణంలోని మేజర్ గ్రామ పంచాయతీ ఆవరణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం ను పారిశుధ్య కార్మికులతో కలిసి సర్పంచి, గౌరవ సలహాదారులు చీపురు పట్టి పరిసరాలను శుభ్రపరిచారు. వారు మాట్లాడుతూ తడి పొడి చెత్తలను వేరు చేయడం వల్ల సేంద్రీయ ఎరువులను ఉత్పత్తి చేయవచ్చని తెలిపారు. ఇఒ నరసింహులు, మాజీ సర్పంచి సోమశేఖర్ అధికారులు పాల్గొన్నారు. పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచి ఆముదాల నాగప్ప, పంచాయతీ సెక్రెటరీ మునిస్వామి పారిశుద్ధ కార్మికులతో కలిసి పరిసర ప్రాంతాల్లో ఉన్న ముళ్ళ చెట్లను చెత్తాచెదారాలను తొలగించారు. స్వచ్ఛ తాహీ సేవా ప్రతిజ్ఞ చేశారు.

క్లాప్‌డ్రైవర్ల సమస్యను పరిష్కరించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో కార్మిక, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ లో పనిచేస్తున్నా క్లాప్ డ్రైవర్లను విధుల్లోకి తీసుకుని, పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరుతూ సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో కార్మిక కర్షక భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు నగర అధ్యక్షులు ఆర్. నరసింహులు, ఓల్డ్ సిటీ అధ్యక్షులు డి.అబ్దుల్ దేశాయ్‌లు అధ్యక్షత వహించారు. రౌండ్ టేబుల్ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి ఎండి.అంజిబాబు, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బతుకన్న, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గురు శేఖర్, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఆటో యూనియన్ జిల్లాకార్యదర్శి కె.ప్రభాకర్, సిఐటియు జిల్లానాయకులు రామాంజనేయులు, భవననిర్మాణ సంఘం జిల్లాకార్యదర్శి కె.సుధాకరప్ప, సిఐటియు ఓల్డ్ సిటీ నగరకార్యదర్శిమారెళ్ళ(విజయ్) రామాంజనేయులు మాట్లాడారు.కార్పొరేషన్ లో గత రెండు సంవత్సరాలుగా పనిచేస్తున్న క్లాప్ డ్రైవర్లకు రెడ్డిఏజెన్సీ, మున్సిపల్ కమిషనర్ ఇప్పటివరకు ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయకపోవడం చాలా దుర్మార్గమన్నారు. ఇద్దరు క్లాప్ డ్రైవర్ కార్మికులు ఈమధ్యలోనే అనారోగ్యంతోమరణించారన్నారు. పిఎఫ్,ఈఎస్ఐ కట్టనందు వలన చనిపోయినవారి కుటుంబానికి ఎటువంటి బెనిఫిట్స్ రాలేదన్నారు. రెడ్డి ఏజెన్సీ మూడు నెలల నుంచి 9 నెలల వరకు క్లాప్ డ్రైవర్లకు జీతాలు ఇవ్వకుండా ఆకలి చావులకు గురి చేస్తుంటే మున్సిపల్ కమిషనర్ చూస్తూ కళ్ళు లేని కబోదిలా వ్యవహరించడం చాలా అన్యాయమన్నారు. రెడ్డి ఏజెన్సీ పై కమిషనర్ చట్టపరంగా చర్యలు తీసుకొని జీతాలు ఇప్పించాల్సిన కమిషనర్ ఆ విధంగా చేయకుండా దానికి భిన్నంగా క్లాప్ డ్రైవర్లను పనిలోకి రావద్దంటూ మిమ్మల్ని తొలగిస్తున్నామంటూ చెప్పడం చాలా దుర్మార్గమని అన్నారు. రెడ్డి ఏజెన్సి వారు రూ.18,500 జీతం ఇవ్వాలని అగ్రిమెంటులో ఉండగా రూ.10,134 ఇస్తున్న పట్టించుకోకపోవడం కమిషనర్ అవివేకానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి క్లాప్ డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలన్నారు. వారికి రావల్సిన బెనిఫిట్స్ వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆవాజ్ కమిటీనగర కార్యదర్శి ఎస్ఎండి. షరీఫ్ సిఐటియు జిల్లా నాయకులు జె.నాగేశ్వరరావు, పి. గోపాల్, ఓల్డ్ సిటీ ఆటో యూనియన్ నగర కార్యదర్శి మైమూర్, కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వెంకట్రాముడులు మాట్లాడారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నేత రామాంజనేయులు

మోత మోగిద్దాం అట్టర్ ప్లాప్

జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన అవినీతి,అక్రమాలపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆదివారం ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా తెలుగుదేశం పార్టీ చేపట్టిన మోత మోగిద్దాం కార్యక్రమం అట్టర్ ఫ్లాప్ అయ్యిందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కనీసం ఐదువేల మంది కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనకపోవడం ఆ పార్టీకి సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. కొంతమంది టిడిపి నాయకులు తప్ప ప్రజలెవరూ పాల్గొన లేదని అన్నారు. చంద్రబాబును అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపడమన్నది కోర్టు పరిధిలోని అంశమని,కోర్టులో న్యాయ ప్రక్రియను నడిపించుకొని చంద్రబాబును బయటికి తెచ్చుకోవడానికి ప్రయత్నం చేయాలి తప్ప అనవసరమైన కార్యక్రమాలు పెట్టి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే ప్రజలు మీపై తిరగబడతారని అన్నారు. నారా భువనేశ్వరి,నారా బ్రాహ్మణి ప్రజల్లో సానుభూతి కోసం ప్రయత్నాలు చేయడం వృథా ప్రయాస అని అన్నారు. వైసిపి నాయకులు వ్యవసాయ మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర్ రెడ్డి,మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షులు యూనుస్ బాషా, వైసిపి బిసి విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, బిసి రిజర్వేషన్ ల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బత్తుల లక్ష్మీ కాంతయ్య మాట్లాడారు.



సూర్యనారాయణ ఆలయంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు నగరంలోని శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో అనగదత్త జ్ఞాన బోధ సభ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని మేనేజింగ్ ట్రస్టీ టి.శివరామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, 29 వార్డు కార్పొరేటర్ సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం శుభపరిణామమని, ప్రజలకోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న సూర్యనారాయణ ఆలయ కమిటీని అభినందించారు. మేనేజింగ్ ట్రస్టీ టి.శివరామకృష్ణ మాట్లాడుతూ ఈ మెగా వైద్య శిబిరానికి ఎమ్మెల్యే కాటసాని రావడం సంతోషమని అన్నారు. డాక్టర్లు సత్య నారాయణ, సి.ఆంజనేయులు,సిఎ.నగేష్ వర్మ, వై.కృష్ణ మోహన్, డి. సిద్దార్థ రెడ్డి ,ఆర్.సుస్రుత ,డి.శ్రీనివాసులు డి.ఆముక్త శ్రీ లు వైద్యాన్ని అందించారని తెలిపారు. ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని దాదాపు 1200మందికి పైగా వైద్య శిబిరంలో వివిధ రకాల వైద్యాన్ని చూపించుకున్నారన్నారు. వైద్యంతో పాటు ఉచిత మందుల పంపిణీ చేశారని తెలిపారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ దేశాయ్

వేదవతి రిజర్వాయర్ నిర్మాణంలో కాలయాపన తగదు

- భూ నిర్వాసితులకు నష్టపరిహారం అందించాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు నియోజకవర్గ కరువు ప్రాంతంలో వేదవతి రిజర్వాయర్ నిర్మించడంలో ప్రభుత్వం కాలయాపన చేయడం తగదని సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ దేశాయ్, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఆలూరు జ్యోతిబసు భవన్‌లో సిపిఎం పార్టీ నాయకులు కెసి.నారాయణ స్వామి అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు శాశ్వత కరువు నివారణ కొరకు హాలహర్వి మండలం గూళ్యం గ్రామ పరిధిలో ప్రవహిస్తున్న వేదవతి నదిపై 8 టిఎంసిలతో రిజర్వాయర్‌లను నిర్మిస్తే 80 వేల ఎకరాలకు సాగు నీరు, 253 గ్రామాలకు తాగునీరు అందించవచ్చన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో రూ.1925 కోట్లతో వేదవతి నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం నిధులను కుదించి 3.5 టిఎంసిలతో రెండు రిజర్వాయర్లు నిర్మిస్తామని రూ.1600 కోట్లు నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపిందన్నారు. రిజర్వాయర్ నిర్మించే మెఘా కంపెనీకి రూ.100 కోట్లు మాత్రమే ఇచ్చి ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. నియోజకవర్గానికి అన్ని వనరులు ఉన్న ఉపయోగించుకోలేని ప్రభుత్వాలు, పాలకులు ఉన్నారని ధ్వజమెత్తారు. తక్షణమే ప్రభుత్వం వేదవతి రిజర్వాయర్ నిర్మాణపనులు చేపట్టాలని, ఆస్పరి మండలంలోని సాగు, తాగు నీరు అందించి రైతులను ఆదుకోవాలన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు భూమికి భూమి లేదా బయట రేటుకి మూడు రెట్లు అదనంగా పరిహారం అందించాలని, ఇల్లు కోల్పోతే 5 సెంట్లు స్థలం ఇచ్చి ప్రభుత్వమే ఇల్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు పిఎస్ రాధాకృష్ణ, మండల నాయకులు షాకీర్, కృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

న్యాయమైన పరిహారం అందించాకే

గాజులదిన్నె ప్రాజెక్టు పనులు చేపట్టాలి

- ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల మండల పరిధిలోని గాజులదిన్నె ప్రాజెక్టు ఆనకట్ట ఎత్తును ఒక మీటర్ పెంపు వలన ముంపుకు గురవుతున్న పొలాల రైతులకు న్యాయమైన నష్టపరిహారం అందించాకే పనులు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి సి రామకృష్ణ, సహాయ కార్యదర్శి సి హనుమంతు డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని వరదొడ్డి, ఎన్నెకండ్ల గ్రామాలలో ముంపుకు గురవుతున్న భూములను వారు పరిశీలించి ఆయా భూముల రైతులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాజులదిన్నె ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యాన్ని 4.5 టీఎంసీల నుంచి 5.5 టీఎంసీలకు పెంచడంలో భాగంగా ప్రాజెక్టు ఆనకట్ట ఎత్తును ఒక మీటరు పెంపును ఏపీ రైతు సంఘం అభినందిస్తూ స్వాగతిస్తోందన్నారు. గోనెగండ్ల మండల పరిధిలోని గోనెగండ్ల వరద బండ, ఎన్నెకండ్ల, నెరుడుప్పల, గంజిహళ్లి గ్రామాలతో పాటు దేవనకొండ మండలంలోని తెర్నేకల్, గుమ్మలాళ్ళ, అలవందిన్నె, బెల్లం దొడ్డి గ్రామాల పరిధిలో సుమారు రెండు వేల ఎకరాలకు పైగా భూమి ముంపుకు గురవుతోందని, ఇందులో కొన్ని భూములు రెండు పంటలు పండేవి కాగా.. మరికొన్ని భూములు మూడు పంటలు పండుతాయని అన్నారు. గతంలోనే ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఆయా గ్రామాల రైతులందరూ సుమారు 5 వేల ఎకరాలకు పైగా భూములను త్యాగం చేశారని ఇప్పుడు మిగిలి ఉన్న ఎకరా రెండు ఎకరాల భూములతో జీవనం సాగిస్తున్న వారిని ఆనకట్ట ఎత్తు పెంపు పేరుతో తక్కువ ధరకే భూ ములను తీసుకొని వారిని నిరాశ్రయులను చేయడం సరికాదని అన్నారు. ఎకరా పొలం బహిరంగ మార్కెట్లో రూ.40 నుంచి 50 లక్షల పలుకుతుండగా ప్రభుత్వం మాత్రం ముంపు రైతులకు ఎకరాకు రూ.4,20,000 పరిహారం ఇస్తామని అనడం మునక రైతులను మోసగించి గొంతు కోయడమేనని విమర్శించారు. వెంటనే జిల్లా కలెక్టర్ ప్రభుత్వం స్పందించి ముంపుకు గురయ్యే రైతులకు ఎకరాకు రూ.50 లక్షల నష్టపరిహారం లేదా భూమికి బదులు భూమిని మరో ప్రాంతంలో కేటాయించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. భూములకు పరిహారం ప్రకటించిన తర్వాతనే సర్వే పనులు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో ఆయా గ్రామాల రైతులందరిని సమీకరించి పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో మునక భూముల రైతులు ఈశ్వర్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నజీర్ సాహెబ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ముంపుకు గురైన భూములను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ తదితరులు

పోలీసుల తీరు అప్రజాస్వామికం : కోట్ల

- బిజెపి ప్రోద్బలంతోనే బాబుపై కేసు

- ఆదోని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్‌లను పరామర్శ

ప్రజాశక్తి - ఆదోని

ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా పోలీసులు చట్టాన్ని చేతిలో తీసుకొని తమ నేతలపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నారని టిడిపి జాతీయ ఉపాధ్యక్షుడు మాజీ కేంద్ర మంత్రి కోట్ల జయసుర్య ప్రకాశ్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు మదిరే భాస్కర్ రెడ్డి, దేవేంద్రప్పలను వారి గ్రామాలు మదిరే, పెద్ద హరివనం వెళ్లి పరామర్శించారు. ఆదోని టూ టౌన్ పోలీసులు వారిని కొట్టడంపై తీవ్రంగా ఖండించారు. మదిరే గ్రామంలోని భాస్కర్ రెడ్డి స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడి అరెస్టును నిరసిస్తూ వివిధ రీతులలో నిరసన తెలుపుతున్న తమవారిపై పోలీసులు అడ్డుకొని పోలీస్ స్టేషన్ కి పిలిపించుకొని సీఐ బూటు కాలుతో తన్నడం చట్ట విరుద్ధమన్నారు. వైసిపి నాయకుల ఒత్తిడితోనే పోలీసులు ఇలా వ్యవహరిస్తున్నారన్నారు. మచ్చలేని తమ అధినేత చంద్రబాబుపై కక్షపూరితంగా సిఎం జగన్ బిజెపి ప్రోద్దలంతో అక్రమంగా కేసులో ఇరికి ంచి జైలుకు పంపారని ఆరోపించారు. త్వరలోనే చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యంలో బయటికి వస్తారని అన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. రాబోయే రోజుల్లో కచ్చితంగా అధికారంలోకొస్తామని ధీమా వ్యక్తం చేశారు. టిడిపి సీనియర్ నాయకుడు రామచంద్ర మాట్లా డుతూ సూరం భాస్కర్ రెడ్డి, దేవేంద్రప్ప మరి కొంతమందిపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టి లోపల వేయాలంటూ పోలీసులు భయపెడుతున్నారని, రాజకీయంగా అనుకుదొక్కేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. ఇలాంటి వాటికి భయపడమన్నారు. ఈ సమావేశంలో సూరం భాస్కర్ రెడ్డి, సౌదీ రావుఫ్, రామచంద్ర, ఫక్రుద్దీన్, సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడిన కోట్ల

టిడిపి నేత ఆరవీటి సుధాకర్ శెట్టిని పరామర్శించిన కోట్ల

ఎమ్మిగనూరు : స్థానిక టిడిపి నేత ఆరవీటి సుధాకర్ శెట్టి అనారోగ్యంగా ఉండడంతో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి ఆదివారం ఎమ్మిగనూరులో ఆరవీటి సుధాకర్ శెటి స్వగృహం నందు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కోట్ల వెంట మాజీ సింగిల్ విండో చైర్మన్ మల్కాపురం నాగిరెడ్డి, కదిరికోట ఆదెన్న, మాజీ జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జి.అల్తాఫ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప్పర (సగర) ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర ఆంజనేయులు, బూదూరు రాఘవేంద్ర రెడ్డి, మల్కాపురం పురుషోత్తమ రెడ్డి, కడివెల్ల ఉరుకుంద గౌడ్, కె. తిమ్మాపురం కురుమన్న, దర్జీ మోషన్న తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



ఆదోనిరూరల్ : పరిశుభ్రత చేస్తున్న సర్పంచ్ హెచ్ హెచ్.రాము

ప్రజాశక్తి - విలేకరులు

మహాత్మగాంధీ జయంతిని పురష్కరించుకొని అన్ని గ్రామ, మండల పంచాయతీల్లో 'స్వచ్ఛతాహి సేవా' కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేపట్టారు.

ఆదోనిరూరల్ : ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యంగా ఉంటామని పెద్ద హరివాణం సర్పంచ్ హెచ్.రాము పంచాయతీ కార్యదర్శి నాగరాజ్ అన్నారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు ప్రజాప్రతినిధులు గ్రామంలోని ర్యాలీ నిర్వహించి, అనంతరం జడ్పీ హైస్కూల్ ఆవరణంలో పిచ్చి మొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యంగా ఉంటామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయం కార్యదర్శి షేక్ అహ్మద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు నరేంద్ర,ఉప్పల్లి, వెల్ఫేర్ అసిస్టెంట్ మధుసూదన్, వైసిపి నాయకులు గర్జప, వీరేష్, కరెప్ప,మల్లిరెడ్డి,ఉపాధ్యాయులు శివప్ప,పంచాయతీ సిబ్బంది ఎంకప్ప, గ్రామ వాలంటీర్లు పరమేష్,గర్జప్ప, లక్ష్మన్న,మహేష్,ఉల్లప్ప, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. **గోనెగండ్ల :** ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా గ్రామాన్ని పరిశుభ్రమైన స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుకో వచ్చని ఇన్చార్జి ఎంపీడీవో నగేష్, గోనెగండ్ల మేజర్ సర్పంచ్ హైమావతి అన్నారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా శ్రీ చింతల ముని నల్లారెడ్డి స్వామి గుడి వద్ద, వైఎస్ఆర్ సర్కిల్ నుంచి ఎంపిడిఒ కార్యాలయం వరకు శ్రమదానం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని ఆదేశాల మేరకు స్వచ్ఛ గ్రామాల ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శి సతీష్, అడ్వకేట్ చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది విరూపాక్షి, శుభాన్, మలాంగ్, అనిల్ పాల్గొన్నారు.

పెద్దనేలటూరు గ్రామంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి లోకేశ్వర రెడ్డి, సర్పంచి సామన్న, పంచాయతీ సెక్రటరీ వెంకట నరసమ్మ, గ్రామ పెద్దలు ఎర్రన్న, లక్ష్మన్న, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు బి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

హోళగుంద : పంచాయతీ కార్యదర్శి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ చలువాది రంగమ్మ కార్యదర్శి రాజశేఖర్‌ల ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్,పాత పోలీస్ స్టేషన్ నందు శ్రమదానం నిర్వహించారు. మండల కన్వీనర్ షఫీయుల్లా,వార్డు సభ్యులు రవికాంత్, హమీద్,సర్పంచ్ తనయుడు పంపాపతి తదితరులు పాల్గొన్నారు. **కోసిగి :** స్వచ్ఛత హి సేవ అనే కార్యక్రమంలో భాగంగా ఒక గంట శ్రమదానం సర్పంచ్ అయ్యమ్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. బస్టాండ్ సర్కిల్, మార్కెట్ యార్డు నందు సర్పంచ్ ఎస్ అయ్యమ్మ, ఇఒఆర్‌డి అరుణ్ రసూద్ ఖాన్, ఆర్‌డబ్ల్యు ఎస్ఈ మల్లికార్జున్ రెడ్డిలు కార్మికులతో కలిసి క్లీనింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అయ్యమ్మ మాట్లాడుతూ ప్రతి ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని చెత్తను ఎక్కడపడితే అక్కడ పారేయకుండా చెత్త కుండలు దగ్గర వేయాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు మాణిక్యరాజు, యువ నాయకులు రాజేష్, పంచాయతీ సిబ్బంది రంగస్వామి, రామకృష్ణ, పారిశుద్ధ కార్మికులు తదితరులు పాల్గొన్నారు. **పెద్దకడబూరు:** మండలంలోని కల్లుకుంట గ్రామపంచాయతీ సర్పంచ్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సర్కిల్, గ్రామపంచాయతీ దగ్గర పరిసరాలను పరిశుభ్రం చేశారు. వైసిపి నాయకులు లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు. **నందవరం :** స్వచ్ఛభారత్ దినోత్సవం సందర్భంగా మండలంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. నందవరం, ముగతిలో పారిశుధ్య కార్మికులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు శివారెడ్డి గౌడ్, వీరుపాక్షి రెడ్డిలు మాట్లాడుతూ పరిశుభ్రత పాటించడంతో పాటు పారిశుధ్య కార్మికులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోట సావిత్రి, జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, ఇఒఆర్‌డి ఈశ్వరయ్య, కార్యదర్శి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. **చిప్పగిరి :** మండలంలోని నేమకల్లులో పంచాయతీ కార్యదర్శి బాలన్న ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి బాలన్న స్వచ్ఛత సేవా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ బుడ్డ సుంకన్న, గ్రామ వాలంటీర్లు, వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు ర్యాలీ నిర్వహించి, అనంతరం మహాత్మా గాంధీ విగ్రహం చుట్టూ ఉన్న పురవీధులలో శ్రమదానం ద్వారా పరిశుభ్రత చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో రెండుసార్లు శ్రమదానం చేసి స్వచ్ఛత సేవ కార్యక్రమంలో గ్రామం మొదటి స్థానంలో ఉండేలా కృషి చేయాలన్నారు. ఇళ్లల్లోనూ నిత్యం శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిదాపుల్లోకి రావన్నారు.

మంత్రాలయం : స్వచ్ఛత పాటించడం ప్రతి పౌరుడు తమ బాధ్యతగా భావించాలని వైసిపి మండల ఇంచార్జి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సి విశ్వనాథ్ రెడ్డి అన్నారు. స్థానిక స్టేట్ బ్యాంక్ బ్రాంచి కార్యాలయం వీధిలో డివిల్ పీఠ శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం చేపట్టారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి శ్రీ మఠం ముఖద్వారం మీదుగా మంచాలమ్మ పాదాల వరకు వీధుల్లో చీపుర్లు పట్టి, చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మణిమంజరి, ఇఓపీఆర్డి ప్రభావతి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వేద స్వరూప, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, ఇఒ నాగరాజు, ఉప సర్పంచ్ హొటల్ పరమేష్ స్వామి ఎంపిటిసి సభ్యులు వెంకటేష్ శెట్టి నాయకులు జనార్ధన్ రెడ్డి, రమేష్, భాస్కర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. **చెట్నిహాల్లిలో..** చెట్నిహల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ అంజినయ్య ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సర్పంచి అంజినయ్య ఉప సర్పంచ్ వీరనాగప్ప వైసిపి





గోనెగండ్ల: శ్రమదానం చేస్తున్న ఎంపీడీవో,సర్పంచ్





గోనెగండ్ల: పెద్దనేలటూరు గ్రామంలో శ్రమదానం చేస్తున్న దృశ్యం



హోళగుంద మండలంలో..



కోసిగి మండలంలో..



'రాయలసీమ హక్కుల సాధనకు పోరాడుదాం'

ప్రజాశక్తి - ఆదోని

ఆంధ్ర రాష్ట్ర అవతరణ స్ఫూర్తితో రాయలసీమ హక్కుల సాధన కోసం పోరాడుదామని ఏపిడిప కన్వీనర్ ఆదినారాయణ, పీడీఎస్యు జిల్లా కన్వీనర్ తిరుమలేష్, ఆర్‌సీసీ పొలిటికల్ ఆర్గనైజర్ రాజన్న పేర్కొన్నారు. ఆదివారం ఆదోనిలోని అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ఆర్‌సీసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని అధికారికంగా ప్రభుత్వం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆంధ్ర రాష్ట్రానికి రాజధానిగా ఉన్న కర్నూల్‌నే నేటి ఆంధ్రప్రదేశ్‌కి రాజధానిగా ఏర్పాటు చేయాలన్నారు. పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాలని కోరారు. ఇప్పుడు ఈ దేశంలో రాజధాని లేని ఏకైక రాష్ట్రం ఏదైనా ఉందంటే అది కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమేనని అన్నారు. రాయలసీమ ప్రాంతానికి రావాల్సిన నీళ్లు, నిధులు, నియామకాల కోసం శ్రీబాగ్ ఒప్పందాన్ని చేసుకున్న దానిని ఏ మాత్రం గౌరవించని పాలకులు నేడు ఈ ప్రాంత భవిష్యత్తును తాకట్టు పెట్టడానికి సైతం వెనుకాడటం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయు జిల్లా కార్యదర్శి గంగన్న, ఈరన్న, ఆర్‌సీసీ నాయకులు శాంతరాజు, నాగేష్, ఉరుకుంద, రాజు, నాగరాజు, బసవరాజు, పీడీఎస్ఓ నాయకులు వీరేష్, ఎంఆర్‌పిఎస్ నాయకులు రామంజి పాల్గొన్నారు.

ఎల్ఐసి ఏజెంట్ల కమ్యూనిటీ హాల్‌కు స్థలాన్ని ఇప్పించండి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎల్ఐసి ఏజెంట్ల కమ్యూనిటీ హాల్‌కు పట్టణంలో స్థలాన్ని ఇప్పించాలని లియాఫీ బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు కే వెంకటేశ్వర్ రెడ్డి, బి ప్రభాకర్ రెడ్డి, ఆర్థిక కార్యదర్శి జెకె శివ రాముడు, జోనల్ డివిజన్ నాయకులు ఆంధ్రయ్య, రమేష్, రంగస్వామి, హరినాథ్, ప్రభాకర్ కోరారు. ఆదివారం లియాఫీ (ఏజెంట్ల సంఘం) ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి నివాసంలో ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు బ్రాంచ్ నందు ఎమ్మిగ నూరు పట్టణం, ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల, మంత్రాలయం, కోడుమూరు, సి బెళగల్, గూడూరు, తదితర మండలాల నుండి ఏజెంట్లు బ్రాంచ్‌కు వివిధ కార్యక్రమాలపై వస్తారని కావున స్థలాన్ని కేటాయింపు చేస్తే కమిటీ హాల్‌ను నిర్మించుకుంటామని తెలిపారు. దేశవ్యాప్తంగా స్థానిక ఎమ్మెల్యేల సహకారంతో ప్రభుత్వ స్థలాల ఇప్పించుకొని కమిటీ హాలు నిర్మిం చుకున్నామని తమరు సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

రావి ఆకుపై గాంధీ, శాస్త్రి చిత్రాలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



అక్టోబర్ 2న జాతిపిత మహాత్మాగాంధీ, భారతదేశ దివంగత ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి మహనీయుల జయంతిని పురష్కరించుకొని ఎమ్మిగనూరు పట్టణం టీచర్స్ కాలనీకి చెందిన కదిరి కోట అశోక్ రావి ఆకుపై గాంధీజీ, శాస్త్రిల చిత్రాలు పెయింటింగ్ వేసి అబ్బురపరిచాడు. కదిరికోట అశోక్ గతంలో అనేక సూక్ష్మ వస్తువులైన చింత పిచ్చు, బియ్యపు గింజ, అగ్గిపెట్టే, గోరు వంటి ఎందరో మహనీయుల చిత్రాలను పెయింటి ంగ్‌తో వేసి తన కళలను ప్రదర్శించారు. ప్రతి ఏటా తన నైపుణ్యాన్ని వెలికి తీసే అశోక్ ఈ ఏడాది (2023) అక్టోబర్ 2 గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రిల చిత్రాలను రావి ఆకుపై వేసి అబ్బురపరిచాడు. చిత్రకారుడు కదిరికోట అశోక్‌ను పలువురు,అధికారులు నాయకులు ప్రశంసించి అభినందనలు తెలియజేశారు.

చంద్రబాబుకు అండగా నిలవాలి : టిడిపి



ఆదోని : అరగుండు తో నిరసన తెలిపిన టిడిపి నాయకులు



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇంచార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కేసులతో మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబును వేధిస్తున్నారని ప్రస్తుత పరిస్థితుల్లో చంద్రబాబుకు అండగా నిలవాలని టిడిపి నాయకులు పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఆదివారం ఆదోనిలో టిడిపి నాయకులు వినూత్నంగా అరగుండు గియించుకొని ఆదోనిలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద దీక్ష శిబింరం వద్ద నిరసన తెలిపారు. ఆదోని ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయు డు, మాల సోదరులు జేబీ గార్డెన్ రంగన్న, లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్ బాలాజీ, చాగి రాము, వొన్నురప్ప, గోపాల్, హత్తి బెలగాల్ ఈరన్న, తుంబుల బీడుఈరన్న, అడ్వకేట్ జనార్ధన్ ఉన్నారు. రిలే నిరాహార దీక్షలకు మాల సోదరులు దీక్షలో కూర్చుని సంఘీభావం తెలిపారు. మాజీ కేంద్ర మంత్రి, జిల్లా పార్లమెంట్ ఇన్‌ఛార్జీ కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్భంచి మాట్లాడారు. ఈ కార్యక్రమం లో సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, యువ నాయకులు కర్నూల్ జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరీ, యువ నాయకులు మారుతి నాయుడు, సిద్ధార్థ్ నాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రాలయం: స్కిల్ డెవలప్ ద్వారా శిక్షణ పొంది సుమారు 60 వేల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జైలులో ఉన్నారని, లక్ష కోట్ల రూపాయలు అవినీతి చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బయట తన హోదాతో టిడిపిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని టిడిపి నియోజకవర్గ ఇంచార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి ఆరోపించారు. స్థానిక రాఘవేంద్ర సర్కిల్లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసుల రెడ్డి, మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి ఆధ్వర్యంలో కోసిగి మండల క్లస్టర్ నెంబర్ 4లో ఉన్న టిడిపి శ్రేణులు 21వ రోజు చేపట్టిన సామూహిక రిలే నిరాహార దీక్షలో ఆయన మాట్లాడారు. మాట తప్పను మడమ తిప్పనని చెప్పిన సిఎం జగన్ నేడు ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా గాంధీ జయంతి సందర్భంగా భువనేశ్వరి నిరాహార దీక్ష చేపడుతున్నారని వారికి మద్దతుగా సోమవారం గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి దీక్షకు సంఘీభావం తెలుపి విజయవంతం చేయాలని కోరారు. దీక్షలో కూర్చున్న వారికి తెలుగు యువత జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి పన్నగ నాగశయనతో కలిసి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చెన్నబసప్ప ధని, అడివప్ప గౌడ్, వెంకటపతి, రాజు, క్లస్టర్ ఇన్ చార్జి చావిడి వెంకటేష్, మారెప్ప, నాగేష్, యేబు, అబ్దుల్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **ఆలూరు:** టిడిపి అధినేత నార చంద్రబాబు నాయుడు అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని కేంద్ర మాజీ మంత్రి, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టు కు నిరసనగా టిడిపి ఇంచార్జీ కోట్ల సుజాతమ్మ అదేశాల మేరకు టిడిపి వాల్మీకులు చేపట్టిన సామూహిక నిరాహారదీక్షకు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడారు. ఈకార్యక్రమం లో టిడిపి రాష్ట్ర నాయకులు నారాయణ రెడ్డి, నారాయణ జిల్లా టిడిపి వాల్మీకి బోయ సాదికారత కమిటీ కన్వీనర్ భాస్కర్ నాయుడు, హంపయ్య తదితరులు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు :** స్థానిక సోమప్ప సర్కిల్‌లో మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అధ్వర్యంలో 19 రోజు నిరాహార దీక్షలు చేపట్టారు. ఎమ్మిగనూరు మండల టిడిపి నాయకులు కందనాతి బోయ కేశన్న, మసీదుపురం రాజ శేఖర్, తిరుమల నాయుడు, నరేంద్ర, ఆంజనేయులు, కేశవ, సోమన్న, రాజు, దేవదాసు, మారెన్న, రాజు,గోవిందు, దేవభుషణం, ఉసేని,గోవిందులు దీక్షలో కూర్చున్నారు.

బిల్డింగ్ కార్మికులందరికీ ఈ శ్రమ్ కార్డులు ఉచితంగా ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



సమావేశంలో మాట్లాడుతున్న బి రాముడు

బిల్డింగ్ కార్మికు లందరికీ ఈ శ్రమ్ గుర్తింపు కార్డులు ఉచితంగా అందజేయాలని సిఐటియు డివిజన్ కార్యదర్శి బి రాముడు, బిల్డింగ్ కార్మిక సంఘం పట్టణ నాయకులు డి ఉస్మాన్ వలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందర భవన్లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మి కులందరికీ సంక్షేమ వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని, గుర్తింపు కార్డులు ఉచితంగా ఇవ్వాలని కోరారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం బిల్డింగ్ కార్మికులకు మోసం చేసిందని, సీఎం జగన్ పదవి చేపట్టాక ఇసుక ధరలు 100 శాతం పెంచడం వల్ల బిల్డింగ్ కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. బిల్డింగ్ కార్మికులకు ఉచితంగా రూ.10000 ఇస్తామని ఇచ్చిన హామీని విస్మరించారన్నారు. పెండింగ్‌లోని క్లెయిమ్స్ సత్వరమే చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు బి ఎస్ అలీ బాష, బి తిమ్మప్ప, వలి, రంగన్న, కైసర్ తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్ర నిండుగా ఉన్నా.. అందని సాగునీరు : మాధవ రావు

ప్రజాశక్తి - నందవరం



మాట్లాడుతున్న మాధవ రావు దేశాయ్

తుంగభద్ర నది నిండుకుండులా ప్రవహిస్తున్న ఎత్తిపోతల ద్వారా ఆ నీటి సాగుకు అందించడంలో మాత్రం అధికార పార్టీ నాయకులు, అధికా రులు విఫలమవుతున్నారని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవరావు దేశాయ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిన్నపాటి వర్షాలతోనే పంటలు వేసుకున్న రైతులు వర్షాలు లేక తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్న సమయంలో తుంగభద్రా నదిలో భారీగా నీరు పారుదల ఉన్న ఆ నీటిని ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందించేందుకు అధికార పార్టీ నాయకులు, అధికారులు విఫలమయ్యారన్నారు. ప్రస్తుత పంట పూత, కాయ దశలో ఉండడంతో రైతులు ఏమీ చేయలేక పంట కోసం డబ్బులు చెల్లించి ఆర్థిక ఇబ్బందుల్లో కోరుకునే పరిస్థితి ఉందన్నారు. మండలంలోని 8 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయని, ఎత్తిపోయని పథకాలుగా మారాయని ఎద్దేవా చేశారు. వైసిపి నాయకులు, అధికారులు స్పందించి రైతాంగాన్ని ఆదుకునేందుకు సాగునీటిని అందించాలని కోరారు.



అభివాదం తెలుపుతున్న నాయకులు

ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ప్రజాశక్తి - కౌతాళం : ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు రామతీర్థం అమ్రేష్ మాదిగ, సూమాల చార్లెస్ డిమాండ్ చేశారు. ఆదివారం సవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ మండల గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కౌతాళం మండల అధ్యక్షుడిగా కే హరిప్రసాద్, గ్రామ అధ్యక్షుడిగా శాంతిరాజు, ఉపాధ్యక్షుడిగా భరత్, సభ్యులుగా సుదర్శనం, సామేలు, విజయ్, నరసయ్య, కుమార్, శ్రీనివాసులు, సూరిబాబు, వీరేష్, ప్రహ్లాద్, శివప్ప, లింగప్ప, రవికుమార్, అఖిల్, డేవిడ్ ,భీమ లింగ, పులేప్ప ,హనుమంతు, పవన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామతీర్థం అమరేష్ మాదిగ, ఎమ్మిగనూరు ప్రధాన కార్యదర్శి సుమాల చార్లెస్, నవ్యాంధ్ర బేడ బుడగ జంగం రాష్ట్ర అధ్యక్షులు మోతే రామరాజు, నాయకులు ప్రసన్నలు మాట్లాడారు.

శ్రీ మఠంలో ప్రముఖులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్ర స్వామిని రాష్ట్ర హైకోర్టు జడ్జీ రాజశేఖర రావు, కర్నాటక రాష్ట్ర ఉప లోకాయుక్త జడ్జీ జస్టిస్ ఫణీంద్ర వేర్వేరుగా ఆదివారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వీరికి శ్రీ మఠం ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతిఆచార్ అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహమూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు వారికి శేష వస్త్రం ఫల మంత్రాక్షతలు మెమొంటో అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసులు ఎస్ఐ వేణుగోపాల్ రాజు ఆధ్వర్యంలో సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.



రాఘవేంద్రుని దర్శించుకున్న జడ్జీ రాజశేఖర రావు

ప్రజాశక్తి
సోమవారం 2 అక్టోబర్ 2023
5
నంద్యాల





అవుకులో కొత్తకాల్వ వద్ద జాతీయ రహదారి దుస్థితి

కూల్చివేత పర్వం

- నంద్యాలలో ఉద్రిక్తత
- బొగ్గు లైన్ రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు, గుడిసెలు కూల్చివేత
- అడ్డుకున్న స్థానికులు - బాధితులకు అండగా సిపిఎం, టిడిపి నాయకులు



ఇండ్లను కూల్చివేస్తున్న జెసిబి



నేలమట్టమైన ఇల్లు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలోని బొగ్గులైన్ రోడ్డుకి ఇరువైపులా అనేక ఏళ్ల నుండి గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేద ప్రజలను అక్కడి నుండి బలవంతంగా ఖాళీ చేయించారు. రోడ్డు వెడల్పు పేరుతో ఆదివారం తెల్లవారుజాము నుండి రెవిన్యూ, మున్సిపల్, పోలీస్ అధికారులు గుడిసెలను కూల్చి వేశారు. దాదాపు 400 మంది పోలీసులతో ముగ్గురు సిఐలు, ఇద్దరు డిఎస్పీలు వచ్చి అక్కడి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి పేద ప్రజలు నివాసం ఉంటున్న ఇళ్లను కూల్చివేశారు. ఇళ్లలో సామాగ్రి, వస్తువులు ఉన్నాయని, సమయం ఇవ్వండని వేడుకున్నా పట్టించుకోకుండా కూల్చివేస్తే తాము ఎక్కడికి వెళ్లాలని వాపోయారు. నిర్వాసిత ప్రజలు ఇళ్ల కూల్చివేతను అడ్డుకున్నారు. బొమ్మల సత్రం ఏరియాలో ఏమి జరుగుతుందో ప్రజలకు అర్థం కాలేదు.. షాక్ నుండి కోలుకునే సరికి దాదాపు బొగ్గులైన్ ఏరియాలో 30 ఇళ్లను నేలమట్టం చేశారు. విషయం తెలుసుకున్న టిడిపి, సిపిఎం నాయకులు సంఘటన స్థలానికి వెళ్లి బాధితులకు బాసటగా నిలిచారు. అధికారుల చర్యలను ఖండించారు. ప్రత్యామ్నాయం చూపకుండా ఎలా కూలుస్తారని మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి అధికారులను నిలదీశారు. కూల్చివేతలను ఆయన తన అనుచరులతో కలిసి అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులు భూమా బ్రహ్మానందరెడ్డిని అరెస్టు చేసి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. భూమాను పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో ఆ ప్రాంతమంతా ఉద్రిక్తంగా మారింది. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ముందు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా చేరుకొని బాధిత ప్రజలతో కలిసి నిరసన తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో భూమా బ్రహ్మానందరెడ్డి నిరసన ధర్నా చేపట్టారు. అక్కడికి చేరుకున్న తహసీల్దార్ శ్రీనివాసులుతో వాగ్వివాదానికి దిగారు. కేవలం పట్టాలు ఇచ్చి ఇళ్లు చూపకుండా ఎంత వరకు సమంజసమని భూమా ప్రశ్నించారు. బొగ్గులైన్ నివాసులకు మౌళిక సదుపాయాలతో కూడిన ఇళ్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కూల్చివేతను అడ్డుకున్న కొంతమంది బాధితులను సిరివెళ్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనేక సంవత్సరాలుగా ఇక్కడే నివాసం ఉంటున్నామని, ఇక్కడ ఇళ్లు కట్టుకోవడానికి లక్షలు రూపాయలు ఖర్చు చేసుకున్నామని బాధితులు వాపోయారు. ఆందోళనను గమనించిన పోలీసులు అక్కడ నుండి ఖాళీ చేయడానికి బాధితులకు మరో 3 రోజులు అవకాశం ఇవ్వాలని తహసీల్దార్‌కు సూచించారు. కలెక్టర్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని, అక్కడ ఇళ్లు ఖాళీ చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. కూల్చివేతకు గురైన ఇళ్లను, బాధితులను మాజీ మంత్రి ఎన్ఎండి ఫరూక్, ఏవి సుబ్బారెడ్డి, ఎన్ఎండి ఫిరోజ్ తదితరులు పరామర్శించి అండగా నిలుస్తామని భరోసానిచ్చారు. ప్రస్తుతానికి ఇళ్లు కూల్చకుండా నిలుపుదల చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ శ్రీనివాసులు స్పందిస్తూ బొగ్గు లైన్‌లో 534 మంది ఉన్నారని, వారిలో 209 మందికి ఎన్ఆర్‌బీఎస్ వద్ద ఉన్న టిడ్కో ఇళ్లను కేటాయించామని, మరో 325 మందికి జగనన్న లేవుట్‌లో ఇళ్లు ఇచ్చామని తెలిపారు. అక్కడికి వాళ్లు వెళ్లనందుకే బల వంతంగా ఇళ్లు ఖాళీ చేయిస్తున్నట్లు వెల్లడించారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా ఖాళీ చేయిస్తే అడ్డుకుంటాం
సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

బొగ్గు లైన్ ప్రాంత ప్రజలకు ఇళ్ల స్థలాలు చూపించిన తర్వాతే ఖాళీ చేయించాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా ఖాళీ చేయిస్తే అడ్డుకుంటామని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.నాగరాజు, పట్టణ కార్యదర్శి పుల్ల నరసింహ హెచ్చరించారు. బొగ్గు లైన్ ప్రాంతంలో కూల్చివేసిన ఇళ్లను, బాధితులను సిపిఎం ప్రతినిధి బృందం పరామర్శించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ బొగ్గులైన్ ప్రాంత ప్రజలను బలవంతంగా ఇల్లు ఖాళీ చేయించడం బాధాకర మన్నారు. వైసిపి ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి అభివృద్ధి పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి, ఇల్లు ఖాళీ చేయించడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఎంపీ స్వలాభం కోసమే బొగ్గులైన్ ప్రాంత పేద ప్రజలను బలవంతంగా బెదిరించి పోలీస్ అండతో ఖాళీ చేయిస్తున్నారని తెలిపారు. గతంలో సిపిఎం అనేకసార్లు బొగ్గులైన్ ప్రాంత ప్రజలకు అండగా నిలిచామన్నారు. ఎంపీ ఇల్లు ఆ ప్రాంతంలోనే ఉన్నాయి కాబట్టి ఇక్కడ పేద ప్రజలను ఖాళీ చేయిస్తే విలువ పెరుగుతుందని, బలవంతంగా ఇల్లు ఖాళీ చేయించడం సరైన పద్ధతి కాదన్నారు. అర్ధరాత్రి నుండి కరెంటు కట్ చేసి అక్కడి ప్రజలను భయ భ్రాంతులకు గురి చేసి బలవంతంగా ఇండ్లను పడగొట్టడం దారుణ మన్నారు. తక్షణమే బొగ్గు లైన్ ప్రాంత ప్రజలకు ఇంటి పట్టాలు ఇచ్చి, ఇల్లు స్థలాలు చూపించి, ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే సిపిఎం ఎంపీ ఇల్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు డి.లక్ష్మణ్, పట్టణ నాయకులు శివ, యువజన సంఘం నాయకులు సాయి, మధు, బన్నీ, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్ ముట్టడించిన బాధిత ప్రజలు, టిడిపి నాయకులు



బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

కుంటల్లా రహదారులు

- చిన్నపాటి వర్షానికే బురదమయం - వాహనదారులకు తీవ్ర అవస్థలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/విలేకరులు

చిన్నపాటి వర్షం వచ్చిందంటే చాలు గ్రామీణ రోడ్లన్నీ కుంటల్లా మారిపోతున్నాయి. చాలా రోడ్లు కంకర, మట్టి తేలడంతో చినుకు పడగానే చిత్తడిగా మారిపోతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు...

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ గ్రామీణ ప్రాంతాల రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. అవుకు మండలంలోని రామాపురం నుండి రాఘవ రాజాపురం వరకు అక్కడక్కడ జాతీయ రహదారి గుంతలమయమై వాహనాలకు వాహనచోదలకు ఇబ్బందిగా మారింది.కొద్దిపాటి చినుకులు పడితే ఈ రోడ్డుపై ఉన్న గుంతలలో నీరు చేరి ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక వాహన చోదకులు కింద పడిన సంఘటనలు ఉన్నాయి. ఈ రోడ్డుపై ఎన్నోమార్లు అధికారులకు తెలియజేసినప్పటికీ కూడా ఏమాత్రం పట్టించుకోవడం లేదని మండల ప్రజలు పేర్కొంటున్నారు. అవుకు నుండి మెట్టుపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో పాలేరు వాగు వద్ద నిర్మించిన నూతన బ్రిడ్జి వద్ద గుంతలు ఏర్పడి మురికి నీరు గుంతలపై ఉండడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాగలమర్రి పట్టణంలో వర్షపు నీరు అంతా రహదారి పైకి చేరి నీటికుంటగా మారింది. రహదారిపై నీరు చేరడంతో కాలనీవాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీరు రోజుల తరబడి నిలబడడంతో దుర్వాసన వెదజల్లుతుంది. దోమలు వ్యాప్తి చెంది రాత్రి పూట కంటిమీద కునుకు ఉండడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి రహదారులపై మురికి నీరు నిలువ లేకుండా చేయాలని కోరుతున్నారు. నందికొట్కూరు పట్టణంలోని 2వ వార్డు శాంతి థియేటర్ వెనుక సందు డంపు యార్డుకు వెళ్లేదారి సిసి రోడ్డు లేక పరిస్థితి దారుణంగా తయారైంది. అధికారులకు ఎన్నిసార్లు సమస్యను గురించి తెలియజేసిన వారు ఎటువంటి పరిష్కారం చూపలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తపల్లి మండలంలోని లింగాపురం గ్రామ ప్రధాన రహదారిపై మురుగు నీరు నిల్వ ఉండటంతో బురదగుంటలా తయారైంది. మహానంది మండలంలోని ఎంసి.ఫారం గ్రామం నుండి మహానంది పుణ్యక్షేత్రం వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర రహదారి అడుగు కో గుంతతో వాహనదారులకు దర్శనమిస్తోంది. మండలంలో గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ గుంతలలో నీరు చేరి రహదారులు వాహన దారులకు చెరువుల వలే దర్శనమిస్తూ అటుగా వచ్చే వాహనదారులకు అగచాట్లకు గురి చేస్తున్నాయి. శ్రీశైలం, తిరుపతి క్షేత్రాల నుండి మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల వారే కాక మన తెలుగు రాష్ట్రాల నుండి మహానంది పుణ్య క్షేత్రంనకు ప్రతినిత్యం వందల సంఖ్యలో భక్తుల వాహనాలు ఈ రహదారుల గుండానే రావలసి ఉంది. కొత్తగా క్షేత్రానికి వచ్చే వాహనదారులకు చెరువుల వలే కనిపిస్తున్న ఈ రహదారులు చూసి దారి తప్పి అడవులలోకి వెళ్ళామా అనే పరిస్థితి నెలకొంది. ఈ రహదారి గుండా క్షేత్రానికి వచ్చిన భక్తులు చాలా పర్యాయాలు వారి వాహనాలు ఈ గుంతలలో ఇరుక్కొని వాహనాలు రిపేర్లు వచ్చిన పరిస్థితులు కూడా చాలా ఉన్నాయి.

అధికారులు పట్టించుకోవడం లేదు



ఏ కొద్దిపాటి వర్షం పడిన రహదారిపై మోకాళ్ళ లోతు నీరు నిల్వ ఉంటుంది. కాలనీ వాసులకు రాకపోవులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించు కోవడం లేదు. మురికి నీరు నిలువ ఉండడం వల్ల దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారిపై మురికి నీరు నిల్వ లేకుండా చూడాలని కోరుతున్నాం.

- ఖాజా రసూల్, చాగలమర్రి.



మహానంది మండలంలో ఎంసి ఫారం నుంచి మహానందికి వెళ్లే రోడ్డులో గుంతలు

నేడు పోలీసు స్పందన తాత్కాలిక రద్దు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నేడు గాంధీ జయంతి సందర్భంగా నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు స్పందన కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున అర్జీదారులు గమనించి రావొద్దని పేర్కొన్నారు. వచ్చే సోమవారం యధావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

వైసిపి ఆత్మకూరు మండల, పట్టణ అధ్యక్షులకు సన్మానం

ప్రజాశక్తి - ఆత్మకూరు

వైసిపి ఆత్మకూరు మండల, పట్టణ నూతన అధ్యక్షులు రాజమోహన్ రెడ్డి, సయ్యద్ మీర్‌లను ఆదివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. అలాగే ఇటీవల ఆత్మకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ఎంపికైన బాలస్వామి, జిల్లా పదవులకు ఎంపికైన తిమోతి, బి భాషలను సన్మానించారు. ఈ సందర్భంగా రాజమోహన్ రెడ్డి, సయ్యద్ మీర్‌లు మాట్లాడుతూ తమకు మండల, పట్టణ అధ్యక్ష పదవులు కల్పించినందకు ఎమ్మెల్యే శిల్ప చక్రపాణి రెడ్డికి, సిఎం జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి శివశంకర్ రెడ్డి, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహానంది ఆలయంలో సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

ప్రజాశక్తి - మహానంది

మహానంది దేవస్థానంలోని పడితరం విభాగంలో ప్రొవిజన్ సరుకులు కొనుగోలు, వినియోగం నమోదులో నిబంధనలు పాటించకపోవడం, భారీగా వ్యత్యాసాలు రావడంతో సీనియర్ అసిస్టెంట్ నీలకంఠం రాజును సస్పెండ్ చేస్తూ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి శనివారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. స్వామివారికి నిత్య కైకర్యాలకు, పడితర ప్రసాదంకు, ఉచిత ప్రసాద వితరణ, నైవేద్యం ప్రసాదం సరుకుల వ్యత్యాసాలు, స్టాక్ రిజిస్టర్ సరిగా లేకపోవడంతో ఈవో విచారణ చేపట్టారు. రూ. 4 లక్షల 50 వేలు తేడా రావడంతో సస్పెండ్ చేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా నీలకంఠం రాజు ప్రస్తుతం కసాపురం దేవస్థానంలో విధులు నిర్వహిస్తుండడంతో సస్పెన్షన్ ఉత్తర్వుల కాపీని కసాపురం ఈవోకు పంపినట్లుగా మహానంది ఇఒ తెలిపారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ప్యాపిలి

మండలంలోని జలదుర్గం గ్రామంలో పాము కాటుతో వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. సిలివేరి రాముడు(40) పొలంలో మొక్కజొన్న పంటలో పని చేస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే అతనిని కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం రాత్రి మృతి చెందాడు . మతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. పోలీసుల కేసు నమోదు చేశారు.

ఢిల్లీలో లోకేష్‌ను కలిసిన ఆళ్లగడ్డ యువ నాయకులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఢిల్లీలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ని ఆళ్లగడ్డ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి, భార్గవ్ రామ్‌లు కలిశారు. ఈ సందర్భంగా వారు ప్రస్తుత రాజకీయాలపై చర్చించినట్లు తెలిసింది. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు త్వరలోనే బయటికి వస్తారని ఆళ్లగడ్డ యువ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

రైతులకు రుణమాఫీ చేయాలి

- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

రాష్ట్రంలోని రైతుల ఆత్మహత్యలను నివారించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే రుణ మాఫీ చేయాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పార్నపల్లి గ్రామంలోని టిటిడి కళ్యాణ మండపంలో రైతు సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడం లేదని తెలిపారు. గిట్టుబాటు ధర, సబ్సిడీ ఎరువులు, సబ్సిడీ విత్తనాలు పూర్తిస్థాయిలో అందించడం లేదని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని కోరారు. రైతులందరూ సంఘటితంగా ఉద్యమించి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్ మాట్లాడుతూ రైతు సంఘాన్ని బలోపేతం చేసి గ్రామస్థాయి నుండి రైతులందరితో కలిసి ఉద్యమించేలా కార్యచరణ రూపొందించాలన్నారు. రైతులకు వ్యవసాయ రుణాలు ఒక లక్ష నుండి 5 లక్షల వరకు పెంచాలన్నారు. స్వామినాథన్ కమిషన్ సూచనలను వ్యవసాయ రంగంలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగం కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు టి రామచంద్రుడు, సుబ్బారాయుడు, వెంకటేశ్వరరావు, సర్వారెడ్డి, నాగరత్నం, సిపిఎం మండల కార్యదర్శి రత్నమయ్య, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం

ప్రజాశక్తి - పగిడ్యాల

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యంగా ఉంటారని జెడ్పిటిసి పుల్యాల దివ్య, మాజీ జెడ్పిటిసి, వైసిపి మండల అధ్యక్షులు పుల్యాల నాగిరెడ్డి, సర్పంచి పెరుమాళ్ళ శేషన్న అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని పగిడ్యాలలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వీధులను, మురికి కాలువలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. చెత్తాచెదారం మురికి కాలువలో వేయకుండా ఇంటి వద్దకి వచ్చే గ్రామపంచాయతీ బండిలో వేయాలని గ్రామస్తులకు సూచించారు. నీటిని కాచి చల్లార్చిన తర్వాత తాగాలన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులను దుశ్శాలు వాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఇఒఆర్‌డి నాగేంద్రయ్య, ఏపీఎం శ్రీనివాసులు, ఏపీఓ మద్దిలేటి, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, వీఆర్వో నాగన్న, సచివాలయాల సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

బండి ఆత్మకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 1984-85 పదవ తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. 38 సంవత్సరాల తర్వాత వివిధ ప్రాంతాలలో స్థిరపడిన వారందరూ కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. పూర్వ విద్యార్థులు కలుసుకోవాలనే ఆలోచనే గొప్ప విషయమని తెలుగు ఉపాధ్యాయుడు ధూపాటి లక్ష్మీనారాయణ, గణితం మాస్టారు పార్వతి, డ్రాయింగ్ మాస్టర్ గురప్ప తెలిపారు. నాలుగు వసంతాలకు వస్తున్న బాల్య నాటి స్నేహితులతో కలుసుకోవాలని, నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకోవాలనే గొప్ప ఆశయంతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకోవడం గర్వించదగినదని అన్నారు. టెక్నాలజీ అంతగా పెరగని కాలంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు కష్టాలు పడి ఉన్నత శిఖరాలను చేరుకున్నారు. వారి శ్రమ, కృషి గురువుల బోధన అనిర్వచనీయ మైనదని తెలిపారు. ఈ సమ్మేళనానికి విచ్చేసిన స్నేహితులకు, మహిళలకు, వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రపంచంలో అన్నిటికంటే ముఖ్యమైన వాడు గురువు, అంతకంటే ముఖ్యమైనది స్నేహం అని రేడియో ఆర్టిస్ట్ పోతన మాస్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భాను, జ్ఞానేశ్వర్, దేవేందర్ రెడ్డి, సలాం ఖాన్, కైలాసనాద్, జి రంగస్వామి, లక్ష్మీనరసింహ, దుర్గాప్రసాద్, సుధారాణి, హరిప్రియ, విజయలక్ష్మి, హుస్సేనమ్మ తదితరులు పాల్గొన్నారు.



1984-85 సంవత్సరం పదవ తరగతి చదివిన విద్యార్థులు

బాబు వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు : టిడిపి

ప్రజాశక్తి - పగిడ్యాల

టిడిపి అధికారంలోకొచ్చి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయినప్పుడే మనందరికీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని, లేదంటే భవిష్యత్తు లేకుండా పోతుందని టిడిపి నందికొట్కూరు నియోజవర్గం నాయకులు బండి జయరాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని నెహ్రూ నగర్ గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షులు గౌరు వెంకట్ రెడ్డి ఆదేశాల మేరకు నెహ్రూనగర్ గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మాండ్ర శివానందరెడ్డి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని తెలిపారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వంలో నిత్యవసర ధరలు, ఎరువుల ధరలు పెరగడం వల్ల రైతులు, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని చెప్పారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, రైతలు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలన్నా, నిరుపేదలకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందాలన్నా, నిరుపేద కుటుంబ విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలన్న చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే ఇది సాధ్యమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు భవిష్యత్తు బంగారంలా సాగుతుందని చెప్పారు. టిడిపికి ప్రజా ఆదరణ పెరిగి వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తుందనే భయంతోనే సిఎం జగన్ చంద్రబాబు నాయుడు పై అక్రమ కేసులు పెట్టించి అరెస్టు చేయించారని మండిపడ్డారు. అలాగే పగిడ్యాల గ్రామంలో 94వ పోలింగ్ బూత్ ఇన్‌చార్జి పగడం శేఖర్ ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నరసింహారెడ్డి, లక్ష్మన్న, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న బండి జయరాజు

జెసిఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్‌ను కలిసిన మండల కన్వీనర్

ప్రజాశక్తి - బేతంచెర్ల

రాష్ట్ర జిసిఎస్ కోఆర్డినేటర్ చల్లా మధుసూదన్ రెడ్డిని బేతంచర్ల మండల నూతన కన్వీనర్ కుంచే తిరుమలేశ్వర్ రెడ్డి, మీడియా కన్వీనర్ రామానాయుడులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చల్లా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి జగన్మోహన్ రెడ్డి పరిపాలన మరొకసారి కావాలని, అందుకు రాష్ట్రంలోని ప్రతి జెసిఎస్ కన్వీనర్లు, మండల కన్వీనర్లు కృషి చేయాలని సూచించారు.



చల్లా మధుసూన్ రెడ్డిని కలిసిన నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రమాదేవి

గత ప్రభుత్వంలో నిర్మించుకున్న ఇండ్లకు బిల్లులు మంజూరు చేయాలి

- హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రమాదేవి

ప్రజాశక్తి - పగిడ్యాల

గత టిడిపి ప్రభుత్వంలో నిర్మించుకున్న పేద ఇండ్లకు బిల్లులు మంజూరు చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంగిరెడ్డి గారి రమాదేవి కార్పొరేషన్ అధికారులను కోరారు. ఆదివారం విజయవాడలోని హౌసింగ్ కార్పొరేషన్ భవనంలో జరిగిన సమావేశంలో రమాదేవి మాట్లాడారు. గత టిడిపి ప్రభుత్వంలో ఎంతో మంది నిరుపేదలు ఇండ్లు నిర్మించుకొని బిల్లులు రాక అప్పులు చేసుకున్నారని తెలిపారు. వారికి రాజకీయపార్టీలకతీతంగా బిల్లులు మంజూరు చేయాలని అధికారులను కోరారు. జగనన్న ప్రభుత్వంలో అర్హులైన వారందరికీ ఇండ్ల పట్టాలు మంజూరు చేశామని, ఇంకా ఎంతోమంది ఇండ్లు లేని నిరుపేదలు ఉన్నారని చెప్పారు. వారికి ఇండ్ల పట్టాలు మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారుల దృష్టికి ఆమె తీసుకెళ్లారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో, గత ప్రభుత్వంలో నిర్మించుకున్న ఇండ్లకు బిల్లులు మంజూరు కానీ లబ్ధిదారుల పేర్ల నివేదిక తయారు చేసి ఇవ్వాలని, తక్షణమే వాటిని పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారని ఆమె తెలిపారు.

15 కుటుంబాలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కార్పెంటర్లు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. ఆదివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విజయకుమార్, సుబ్బరాయుడు, సూరి, వెంకట్, శాంతు, కిషోర్, వహిబ్, దిలీప్, సాగర్, సంతోష్, బాలు, నాగయ్య, సురేష్, కరుణాకర్‌తోపాటు 15 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే సమక్షంలో టిడిపిలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే టిడిపి కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా టిడిపిలో చేరినట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉండాలంటే టిడిపి ప్రభుత్వం రావాలన్నారు. 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు.


మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరుతున్న కార్పెంటర్లు

రాబోయే ఎన్నికల్లో వైసిపికి బుద్ధి చెప్పాలి

- మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

రాబోయే ఎన్నికల్లో యువత, మహిళలు పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొని జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి కోరారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం 19వ రోజుకు చేరుకున్నాయి. రాజ్‌పుత్, బొందిలి సంఘం నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి, టిడిపి రాష్ట్ర మైనారిటీ అధ్యక్షుడు ముస్తాక్ మౌలానా మాట్లాడారు. అనంతరం దీక్షలో పాల్గొన్న వారికి నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. నాయకులు శ్రీనివాస సింగ్, అనిల్ కుమార్ సింగ్, బాలాజీ సింగ్, రాజేంద్ర సింగ్, భవాని సింగ్, చైన్ సింగ్, మహిళలు భారీఎత్తున పాల్గొన్నారు. **బనగానపల్లె :** పట్టణంలోని టిడిపి కార్యాలయ సమీపంలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా రజక సంఘం నాయకులు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన దీక్షలో రజక (చాకలి) సంఘం నాయకులు పుల్లయ్య, నాగేంద్ర, మద్దిలేటి, మహేంద్ర, సాలన్న పాల్గొన్నారు. దీక్షలో పాల్గొన్న రజకుల నాయకులకు టిడిపి ఎస్టీ సెల్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కృష్ణ నాయక్,బీసీ సంఘం నాయకులు వేములపాడు గుర్రప్ప, చిన్నరాజుపాలెం సర్పంచ్ నరసింహులు, మంగంపేట శ్రీనివాసులు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. **నందికొట్కూరు :** టిడిపి నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఇంచార్జ్ గౌరు వెంకట రెడ్డి ఆదేశాల మేరకు 19వ రోజు మండల కన్వీనర్ ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజ్ కార్యదర్శి జయసూర్య, నాయకులు బండి జయరాజు సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో ఓబుల్ రెడ్డి, మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రసాద్ రెడ్డి, బండి జయరాజు, పలుచాని మహేష్ రెడ్డి, అల్లూరు సర్పంచ్ నాగలక్ష్మయ్య, లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నంద్యాల: దీక్షల్లో పాల్గొన్న రాజ్‌పుత్, బొందిలి సంఘం నాయకులు

నేడు బిసి దంపతుల రిలే నిరాహార దీక్షలు

బనగానపల్లె : గాంధీ జయంతి సందర్భంగా సోమవారం ఉదయం 9 గంటలకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజమండ్రి సెంట్రల్ జైలులో చేపడుతున్న నిరాహార దీక్షకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, ఆయన సతీమణి బిసి ఇందిరాలు బనగానపల్లెలో రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. నియోజకవర్గంలోని టిడిపి నాయకులు ,కార్యకర్తలు, అభిమానులు దీక్షలకు మద్దతు తెలిపాలని కోరారు.

శాలివాహన ఫెడరేషన్ యువజన అధ్యక్షునిగా గార్లదిన్నె కుమ్మరి సుధాకర్



ప్రజాశక్తి - డోన్ : బెంగళూరులో ఆదివారం జరిగిన దక్షిణ భారత కుంభార (ప్రజాపతి/శాలివాహన) ఫెడరేషన్ కమిటీ ఎపి నుండి యువజన అధ్యక్షునిగా గార్లదిన్నె కుమ్మరి సుధాకర్‌ను ఫెడరేషన్ అధ్యక్షులు శివకుమార్ చౌడ శెట్టి, తుగ్గలి నాగేంద్ర, ఐలాపురం శ్రీను సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యువజన అధ్యక్షుడు గార్లదిన్నె కుమ్మరి సుధాకర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఇంతటి పదవిని అందించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. శాలివాహన సంఘం బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు.

నేడు మాంసం విక్రయాలు నిషేధం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నేడు గాంధీ జయంతిని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని జంతు వధశాలలు, మటన్, చికెన్, చేపలు తదితర విక్రయ దుకాణాలు మూసివేయాలని మున్సిపల్ కమిషనర్ పి.కిషోర్ ఆదివారం ఓ ప్రకటనలో ఆదేశించారు. నిబంధన అతిక్రమిస్తే జరిమానా, ట్రేడ్ లైసెన్సు రద్దు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రూ. 12 కోట్లతో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం

- డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి - డోన్

డోన్ పట్టణంలోని కర్నూలు-నంద్యాల రైల్వే గేట్ల మధ్యలో రూ. 12 కోట్లతో నూతనంగా అండర్ పాస్ బ్రిడ్జి ప్రజల సౌకర్యార్థం నిర్మించనున్నట్లు డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. ఆదివారం డోన్ పట్టణంలో అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి ఆర్అండ్ బి,రైల్వే అధికారులు చేస్తున్న మార్కింగ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ట్రాఫిక్ సమస్య తీరుతుందన్నారు. కొండపేట, చిగురుమాను పేట, పాతపేటలో ఉండే ప్రజలు డోన్ పాత బస్టాండ్ వైపు ఉన్న ప్రజలతో రాకపోకలు సజావుగా జరుగుతాయన్నారు. ప్రజల సౌకర్యార్థం ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సెంట్రల్ గవర్నమెంట్‌తో ఒప్పించి బ్రిడ్జి మంజూరు చేయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కొట్రికే హరికిషన్, జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్లు దినేష్ గౌడ్, వైసిపి నాయకులు వంశీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఆర్ అండ్ బి ఏఈ శ్రీకాంత్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

సుబ్బారాయుడు స్వామికి వెండి పడిగె వితరణ

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం కొత్తూరు సుబ్బారాయుడు స్వామికి నంద్యాలలోని డేనియల్ పురంకు చెందిన ఉమా శంకర్ కుమారుడు నరేష్ కుమార్ 580 గ్రాముల వెండి నాగ పడిగను వితరణగా ఆదివారం అందజేశారు. వారికి దేవస్థానం అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

ప్రజాశక్తి - చాగలమర్రి

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని జాతీయ రహదారి ప్రాజెక్టు డైరెక్టర్ నీరజ్ గుప్తా తెలిపారు. ఆదివారం చాగలమర్రిలోని ఆర్ఇపిఎల్ టోల్ ప్లాజా కడప-కర్నూల్ రూట్ మేనేజర్ కొండలరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మదన్మోహన్, హార్టికల్చర్ అధికారిని నిహారిక, హరినాథ్, టోల్గేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

30 కుటుంబాలు టిడిపిని వీడి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని బిసి కాలనీకి చెందిన ముస్లిం మైనారిటీకి చెందిన 30 కుటుంబాలు టిడిపిని వీడి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు.బిసి కాలనీకి చెందిన షేక్షావలి, షాషావలి, మహమ్మద్ హుస్సేన్, హుస్సేన్ వలి, ముక్తియర్ వలి, గౌసులు, హమీద్, రషీద్, హుస్సేన్ వలి, షేక్ మహబూబ్ వలి, మహమ్మద్ రఫీ, కార్పెంటర్ అలీ, ఖాజా హుస్సేన్, అబ్దుల్ అఖాని, భాష, షేక్షావలి, ఇబ్రహీం, హుస్సేన్ వలి, మక్బూల్, మద్దయ్య, పకీరయ్య, నాగరాజు, రత్నమయ్య, వలి భాష, హుస్సేన్, హాజీవలి, అజీమ్, ఇమామ్ హుస్సేన్, కొత్తపల్లి హుస్సేన్ భాష, అబ్దుల్లా తదితరులు వైసీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు గుండం నాగేశ్వర రెడ్డి, పార్టీ ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, మండల కన్వీనర్ సన్నల జనార్దన్ రెడ్డి, భానుముక్కల రైతు సహకార పరపతి సంఘం కన్వీనర్ నీలి శ్రీనివాసులు, ఎంపిటిసి వెంకటసుబ్బయ్య, జిల్లా రైతు సంఘం మాజీ అధ్యక్షుడు జిల్లెళ్ళ శివరామిరెడ్డి, నాయకులు జిల్లెళ్ళ శంకర్ రెడ్డి, గౌండ నాగరాజు, అబ్దుల్ ఫైజ్, అత్తార్ జాహిద్ హుస్సేన్, డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, సైకిల్ షాప్ మహబూబ్ వలి, కుమ్మరి సురేష్, బండి బ్రహ్మానందరెడ్డి, దేవుడు, పోలూరు కష్ణ, అంబటి రవికుమార్ రెడ్డి, ఖానిక్, రసూల్, గౌస్ పీర్, అత్తార్, అఖిల్ హుస్సేన్, సుబ్బరాయుడు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైసీపీలో చేరుతున్న టిడిపి నాయకులు


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

వైసిపి ప్రజల ప్రభుత్వం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గడివేముల : వైసిపి ప్రజల ప్రభుత్వమని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బిలకల గూడూరు గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రభుత్వ నుంచి వచ్చే పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ఎంపీపీ నాగమద్దమ్మ, జడ్పిటిసి ఆర్బి చంద్రశేఖర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ శేఖర్ రెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు శివరాం రెడ్డి, రఘు మాధవరెడ్డి, రాజారెడ్డి, ఆర్బికే కరిమద్దెల పుల్లయ్య, మేఘనాథ్ రెడ్డి ఉపసర్పంచ్ బాలచెన్ని, భూపాల్ రెడ్డి, ఎల్లారెడ్డి, ఎంపీటీసీ ఒగ్గు రామస్వామి, నాయకులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికలకు సమాయత్తం కావాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రానున్న ఎన్నికలకు ఇప్పటినుంచే సమాయత్తం కావాలని ఎమ్మెల్యే గంగుల నాని అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే గంగుల అధ్యక్షతన జెసియస్ కన్వీనర్లతో, గృహ సారథులతో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులను ఉద్దేశించి దిశా నిర్దేశం చేశారు. రాబోయే ఎన్నికలకు నేటి నుంచే సమాయత్తం కావాలని, ప్రభుత్వం చేసిన ప్రతీ మంచి పనిని ప్రజలకు చేరవేయాలన్నారు. వైసిపి అఖండ మెజార్టీతో గెలుపొందాలని, దాని కోసం అందరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో విజయ మిల్క్ డైరీ చైర్మన్ ఎస్వి జగన్మోహన్ రెడ్డి, పుట్టాలమ్మ చైర్మన్ గంగుల మనోహర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే


ప్రతిజ్ఞ చేయిస్తున్న ఇఒఆర్‌డి శ్రీనివాసులు నాయుడు

గ్రామాల పరిశుభ్రలో అందరి భాగస్వామం అవసరం

- ఇఒఆర్‌డి శ్రీనివాసులు నాయుడు

ప్రజాశక్తి - పాములపాడు

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని శ్రీనివాసులు నాయుడు అన్నారు. స్వచ్ఛతా ఈ సేవ కార్యక్రమం పాములపాడు మండలంలోని 13 గ్రామపంచాయతీ సచివాలయంలో నిర్వహించారు. గ్రామపంచాయతీల్లో సర్పంచులు చంద్రారెడ్డి, నాయని సావిత్రమ్మ, వనమాల ప్రసాదరావు, బాల మల్లేశ్వర్ రెడ్డి, మంగమ్మ బాయ్, రామస్వామి, అత్తరుని సాబి, ఎం లత, మాణిక్యమ్మలు పాల్గొని గ్రామ శ్రమదానంలో పాల్గొని వీధులను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇఒఆర్‌డి శ్రీనివాసులు నాయుడు భానుముక్కల గ్రామంలో పాల్గొని ఉత్తమ సేవలు చేసిన గ్రీన్ అంబాసిడర్లను సన్మానించారు. అందరితో గ్రామాన్ని శుభ్రంగా ఉంచుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు రామలింగేశ్వర రెడ్డి, నాయకులు వెంకటేశ్వరరావు, ఉపేంద్ర, పంచాయతీ కార్యదర్శులు పుల్లయ్య, నాగార్జున రెడ్డి, తిప్పన్న, శివలింగం, కృష్ణప్రియ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో పెరిగిన భక్తుల సందడి

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి పెరిగింది. స్వామి అమ్మవారిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాక పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో శ్రీశైలం చేరుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని తెల్లవారుజామున 4-30 గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర, క్యూలైన్లలో భక్తులకు అనుమతి ఇచ్చారు. క్యూ కాంప్లెక్స్‌లోకి వచ్చిన భక్తులకు మంచినీరు, అల్పాహారం, బిస్కెట్లు అందిస్తున్నారు. దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పడుతుందని భక్తులు చెబుతున్నారు. భక్తులు అడిగినన్ని ఇచ్చేందుకు లడ్డు ప్రసాదాలు అందుబాటులో ఉంచారు. అన్నపూర్ణ భవనంలో భక్తులకు ఉచిత అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. క్షేత్ర పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి నిఘా కెమెరాలతో కంట్రోల్ రూమ్‌లో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. క్షేత్ర పరిధిలో ఉన్న కమ్యూనిటీ సత్రాలు భక్తులతో నిండిపోయాయి.



ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలి

- రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు

ప్రజాశక్తి - రుద్రవరం

ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని రుద్రవరం ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు తెలిపారు. ఆదివారం రుద్రవరం ఫారెస్ట్ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వాడకంపై వచ్చే ఇబ్బందుల గురించి ప్రజలకు , భక్తులకు దుకాణం దారులు, హోటల్, సత్రం, యజమానులకు అవగాహన కల్పించారు. అలాగే ఎగువ అహోబిలం నుంచి కారంజి నరసింహస్వామి దేవాలయం వరకు రోడ్లపై పడి ఉన్న వ్యర్థ పదార్థాలు, ప్లాస్టిక్ కవర్లు, సీసాలను శ్రమదానం ద్వారా తొలగించారు. కార్యక్రమంలో అహోబిలం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ముర్తుజావలి, సెక్షన్ ఆఫీసర్లు నాగరాజు, శ్రీనివాసరెడ్డి, మత్తర్ భాష, రానేమ్మ, బీట్ ఆఫీసర్లు విజయవర్ధన్, రామకృష్ణ, మహమ్మద్ భాష,అహోబిలం క్షేత్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** ప్లాస్టిక్ అనర్థాలను పూర్తిగా తొలగించాలని మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. ఆదివారం పట్టణంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో శానిటరీ ఇన్స్పెక్టర్ సునీత, బాలస్వామి, పారిశుధ్య కార్మికులు పరిశుభ్రతపై ర్యాలీ ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సురేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రుద్రవరం : రోడ్డుపై ఉన్న ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను తొలగిస్తున్న ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది

దళితుల హక్కులపై కేంద్రం దాడి : కెవిపిఎస్

ప్రజాశక్తి - ఆత్మకూర్

బిజెపి అధికారంలోకి వచ్చాక దేశంలో రాజ్యాంగం దళితులకు కల్పించిన హక్కులపై తీవ్ర దాడి జరుగుతుందని కెవిపిఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు వి ఏసురత్నం, జిల్లా కార్యదర్శి కే రామదాసు అన్నారు. భారత రాజ్యాంగాన్ని, దళిత హక్కులను కాపాడుకునేందుకు దళితుల సమస్యలు రాజకీయ పార్టీల అజెండాగా మారేలా పోరాటాలను నిర్వహించాలని తెలిపారు. ఆదివారం స్థానిక సుదర్శన వర్మ స్మారక భవనంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చాక సబ్ ప్లాన్ చట్టాన్ని రద్దు చేసి దళిత గిరిజనులకు ద్రోహం చేసిందన్నారు. ప్రభుత్వం రంగ సంస్థలను కార్పోరేట్లకు కట్టబెట్టడం వల్ల రిజర్వేషన్లు అమలు జరగడం లేదన్నారు. నూతన విద్యా విధానం పేరుతో దళితులకు గిరిజనులకు విద్యను దూరం చేసే దుర్మార్గమైన చర్యలకు కేంద్ర ప్రభుత్వం పాల్పడుతుందని తెలిపారు. జగన్ ప్రభుత్వం కేంద్రంలోని బిజెపికి వంత పాడుతూ దళిత గిరిజనుల భూములను లాక్కోవడానికి 9/77 చట్టానికి సవరణ, అసైన్డ్ భూములను అమ్ముకోవచ్చనే సవరణలు చేసిందన్నారు. దళితులపై నేటికి అనేక గ్రామాలలో వివక్ష కొనసాగుతుందన్నారు. కెవిపిఎస్ ఆవిర్భావ సందర్భంగా దళితుల సమస్యలను అన్ని గ్రామాలలో విస్తతంగా ప్రచారం చేసి రాజకీయ పార్టీల అజెండాగా మారే విధంగా పోరాటాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ సహాయ కార్యదర్శి పాతకోట భాస్కర్, వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, నాయకులు బొల్లు ప్రసాద్ బాబు యాదవ్, అడ్వకేట్ అంకిరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా నాయకులు


పరికరాలు అందజేస్తున్న తెలుగు నాగరాజు

గ్రీన్ అంబాసిడర్లకు పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడులోని గ్రీన్ అంబాసిడర్లకు టిఎన్ఆర్ కంపెనీ అధినేత తెలుగు నాగరాజు బ్యాలేలు, చలికెలు, పొరకలు తదితర పనిముట్లను పంపిణీ ఆదివారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. గ్రామ పరిశుభ్రతలో అందరి భాగస్వామ్యం ఉండాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ గోపాలు, వైసిపి నాయకులు రాజశేఖర్ పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుల గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలోని రంగస్థల కళాకారులు గుర్తింపు కార్డుల కోసం ఈ నెల 7వ తేదీ లోపు దరఖాస్తులు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో సమర్పించాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ టి.విజయకుమార్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని కళాకారులకు కొత్తగా గుర్తింపు కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇందుకు సంబంధించి అర్హులైన రంగస్థల కళాకారులు సూచించిన ప్రొఫార్మా ప్రకారం దరఖాస్తు పూర్తి చేసి సమర్పించాలని సూచించారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం : డిపిఒ

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

అందరం కలిసి ఒక గంట స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని గ్రామాలను పరి శుభ్రంగా ఉంచుకుందామని జిల్లా పంచాయతీ అధికారి మంజుల వాణి తెలిపారు. ఆదివారం నంద్యాల మండలంలోని పాండు రంగాపురం, కానాల అయ్యాలూరు మెట్ట గ్రామ పంచాయతీలలో ప్రధానిపిలుపు మేరకు ఏక్ తారీక్, ఏక్ గంట, ఏక్ సాత్, స్వచ్ఛత హై సేవా కార్యక్రమం జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో చేపట్టారు. శ్రమదానం చేసి మురికి కాలువల్లో చెత్త, పిచ్చి మొక్కలు తొలగించారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డి మహీధర్ రెడ్డి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శిలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అంగన్వాడీ సూపర్వైజర్లు సుశీల, దీప్తి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద చింతకుంట నాలుగో అంగన్వాడి కేంద్రంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ వర్కర్లు వసంత, రాజ్యలక్ష్మి, శైలజ, పెద్దక్క, నరసమ్మ, లక్ష్మీ కుమారి, ఉమాదేవి, మమత, బాల తిమ్మమ్మ, వెంకట సుబ్బమ్మ, పద్మావతి, చేన్నమ్మ తదితరులు పాల్గొన్నారు. **బేతంచర్ల :** బేతంచర్ల పట్టణం, గ్రామాల పరిశుభ్రత లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, చైర్మన్ చలం రెడ్డి అన్నారు. ఆదివారం స్వచ్ఛతాహి ఈ సేవ కార్యక్రమాన్ని కమిషనర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో గోరుమానుకొండ గ్రామం, ఆర్ఎస్ రంగాపురం, కొత్తపల్లి తదితర ప్రాంతాలలో సర్పంచులు గుమ్మగాళ్ల రాజు, కోడె వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, పర్వీన్, కౌన్సిలర్లు చింతల నాగిరెడ్డి, ముబీనా, శకుంతల, మధు, ఇబ్రహీం, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. **ప్యాపిలి :** పరిసరాల పరిశుభ్రతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని జడ్పిటిసి బోరెడ్డి శ్రీ రామరెడ్డి, సర్పంచి లక్ష్మీదేవి అన్నారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు చీపురుతో రోడ్లను ఊడ్చారు. జంగం చంద్రయ్య, ఈఓఆర్‌డి బాలకృష్ణ, ఈవో శివకుమార్, ప్రభాకర్ రెడ్డి, నిజాముద్దీన్ పంచాయతీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.


నంద్యాల : స్వచ్ఛగ్రామంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేయిస్తున్న డిపిఒ



బేతంచెర్లలో...


ఆళ్లగడ్డలో శుభ్రం చేస్తున్న దృశ్యం


ప్యాపిలిలో...